21-07-2025
సోమవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 03 | సంచిక : 58 | పేజీలు : 8 | వెల : 5
ఎడిటర్ మోతె రఘు తిరుపతి

## కేంద్రంపై కేటీఆర్ ఫైర్..

పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే సహించేది లేదని కేటీఆర్ అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఫ్యామిలీ ప్లానింగ్ సక్సెస్ అయ్యిందని .. కానీ ఉత్తరాదిలో అలా జరగలేదన్నారు. అంతేకాకుండా ఏపీ, తెలంగాణలో ఎమ్మెల్యే స్థానాల పెంపు ఏమైందని కేంద్రాన్ని ప్రశ్నించారు.



# ఎమ్మెల్యే స్థానాల పెంపు ఇంకెప్పుడు..?


**జయభేరి, హైదరాబాద్ :**

తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్యే స్థానాలను పెంచాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రజల సమస్యలకు మెరుగైన ప్రాతినిధ్యం కోసం నియోజకవర్గాల పునర్విభజన అవసరమని అభిప్రాయపడ్డారు. ఎంపీ స్థానాలను ఫ్రీజ్ చేసి.. ఎమ్మెల్యే స్థానాలే పెంచాలన్నారు. తెలంగాణ కాంగ్రెస్ కూడా ఈ విషయంలో బీఆర్ఎస్ అభిప్రాయానికి అనుగుణంగానే ఉంటుందన్నారు. జైపూర్‌లో జరిగిన టాక్ జర్నలిజం 9వ ఎడిషన్‌లో కేటీఆర్ మాట్లాడారు. 2014లో ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ, ఏపీకి ఎమ్మెల్యే స్థానాలను ఇంకా పెంచలేదన్నారు. అదే జమ్ము కాశ్మీర్, అస్సాం రాష్ట్రాల్లో పెంచినట్లు గుర్తు చేశారు. జనాభా నియంత్రణను పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో నష్టం జరగకూడదని అన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో పెరిగిన జనాభా ఆధారంగా సీట్ల పెంపు సమాఖ్య వ్యవస్థకు విరుద్ధమని.. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే నిర్ణయాలకు బీజేపీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

దక్షిణాది రాష్ట్రాల్లో ఫ్యామిలీ ప్లానింగ్ విజయవంతమైందని కేటీఆర్ చెప్పారు. కానీ ఉత్తరాదిలో అలా జరగలేదని..1950 నుంచి ఉత్తరప్రదేశ్‌లో 239శాతం జనాభా పెరుగిందన్నారు. అదే కేరళలో కేవలం 69శాతం పెరుగుదల మాత్రమే ఉందని చెప్పారు. అయినా దక్షిణాదికి తక్కువ సీట్లు కేటాయించడం అన్యాయమని మండిపడ్డారు. బీహార్ ఓటర్ల గల్లంతు అంశంపైనా కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఐదు లక్షల ఓట్లు గల్లంతవడం.. ప్రజాస్వామ్యంపై తీవ్రమైన ప్రమాద సంకేతమన్నారు. ఈ అంశంపై ఎన్నికల సంఘం స్పందించాలన్నారు. ప్రజలు రోడ్లపైకి రాలేదని అన్నీ బాగున్నట్లుగా భావించకూడదన్నారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంలో బీజేపీపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు.

**జాతీయ భాష అవసరం లేదు**

ఫస్ట్ దేశం.. ఆ తర్వాతే కులం, మతం అని కేటీఆర్ అన్నారు. దేశానికి జాతీయ భాష అవసరం లేదని.. హిందీని బలవంతంగా రుద్దడం అహంకార చర్య అని విమర్శించారు. భాషలు, సంస్కృతి, ఆహారం.. ప్రతి 250 కిలో మీటర్లకు మారుతూ ఉంటాయన్నారు. ప్రజలు మాట్లాడని భాషలు కాలక్రమంలో కనుమరుగవుతాయన్నారు. ప్రపంచ దేశాల్లో ఇంగ్లీష్ వల్లే అవకాశాలు లభిస్తాయని.. హిందీతో అవకాశాలు ఉండవన్నారు.



## హైదరాబాద్‌లో బోనాల వైభవం..

**బోనాలు, తెలంగాణలో ఆషాఢ మాసంలో జరిగే హిందూ పండుగ, మహాకాళికి అంకితం. "బోనం" అనగా "భోజనం" లేదా "విందు". భక్తులు అమ్మవారికి ఆహారం, నైవేద్యాలు సమర్పిస్తారు.**

ఆషాఢ మాసంలో జరిగే బోనాల పండుగ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఈ ఉత్సవాలను ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. ఆదివారం సెలవు దినం కావడంతో.. నగరంలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. లాల్ దర్వాజ సింహవాహిని మహాకాళి అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని, ఆలయ కమిటీ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం నాలుగు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఇందులో బోనాలు సమర్పించే వారి కోసం ఒక ప్రత్యేక క్యూలైన్ అందుబాటులో ఉంది.

1200 మంది పోలీసులు, 10 షీ టీమ్స్‌తో ఆలయం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారిని దర్శించుకోవడానికి వీలు కల్పిస్తుంది. భక్తుల ఆరోగ్య సంరక్షణ కోసం రెండు మెడికల్ క్యాంపులను కూడా ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో భాగంగా, మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన బోనాలను (పసుపు, కుంకుమ, బెల్లం, నైవేద్యాలతో నిండిన కుండలు) తలపై పెట్టుకొని, డప్పు వాయిద్యాల మధ్య, పోతురాజుల విన్యాసాలతో ఆలయాలకు చేరుకుంటారు. అమ్మవారికి ఈ నైవేద్యాలను సమర్పించి, తమ కుటుంబాలకు సుఖ సంతోషాలు, ఆరోగ్యం ప్రసాదించాలని వేడుకున్నారు.

**అమ్మవారికి.. బంగారు బోనం సమర్పించిన హైదరాబాద్ కలెక్టర్..**

లాల్ దర్వాజతో పాటు, సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహాకాళి ఆలయం, బల్కంపేట ఎల్లమ్మ ఆలయం, కార్వాన్‌లోని అక్కన్న మాదన్న దేవాలయం, గోల్కొండ కోటలోని జగదాంబిక ఆలయం వంటి అనేక ప్రసిద్ధ ఆలయాల్లో కూడా బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. తెలంగాణ ప్రజలు ఈ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు.

ప్రఖ్యాత గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ గారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. బోనాల పండగ సందర్భంగా కోటి రూపాయల నగదు పురస్కారాన్ని ప్రభుత్వం ప్రకటించింది. పాతబస్తీకి చెందిన గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ RRR సినిమాలో నాటు నాటు పాట ద్వారా అంతర్జాతీయ స్థాయిలో అస్కార్ అవార్డును అందుకున్నారు. సొంత కృషితో ఎదిగిన రాహుల్ సిప్లిగంజ్ తెలంగాణ యువతకు మార్గదర్శకుడు అని ముఖ్యమంత్రి ప్రశంసించారు. ప్రపంచ వేదికపై తెలుగు పాటకు ఖ్యాతిని తీసుకొచ్చిన రాహుల్ సిప్లిగంజ్ గారికి కోటి రూపాయల నగదు పురస్కారం ఇస్తామని రేవంత్ రెడ్డి గతంలో ప్రకటించారు. ఇటీవల గద్దర్ అవార్డుల సందర్భంగా కూడా ప్రత్యేకంగా రాహుల్ సిప్లిగంజ్ పేరును ప్రస్తావిస్తూ త్వరలోనే ప్రభుత్వ ప్రకటన ఉంటుందని చెప్పారు. ఆ మేరకు ఇవాళ పాతబస్తీ బోనాల పండగ సందర్భంగా రాహుల్ కు నజరానా ప్రకటించారు.





## కర్నాటక రాజకీయాల్లో కొనసాగుతున్న హైడ్రామా

### డీకేపై సిద్దరామయ్య సంచలన కామెంట్స్

**జయభేరి, కర్నాటక :**

కర్నాటక రాజకీయాలు రసవత్తరంగా మారాయి. సీఎం సిద్దరామయ్య , డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య ఆధిపత్య పోరు తారా స్థాయికి చేరింది. ఐదేండ్ల వరకు గద్దె దిగేది లేదంటూ సీఎం సిద్ద రామయ్య భష్మించుకోగా, ఒప్పందం ప్రకారం సీఎం సీటు తనకు అప్పగించాల్సిందేనంటూ డీకే పట్టుపడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటక కాంగ్రెస్ రెండు వర్గాలుగా చీలిపోయింది. పార్టీ ఎమ్మెల్యేలు రెండు వర్గాలుగా చీలిపోయి బహిరంగంగానే విమర్శలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో హైకమాండ్ సైతం వార్నింగ్ ఇచ్చినా లాభం లేకుండా పోయింది. తాజాగా మైసూరులో జరిగిన ఓ సభలో సిద్దరామయ్య చేసిన కామెంట్స్ డీకే వర్గంలో మంటలు రాజేసింది. తన ప్రసంగంలో డిప్యూటీ డికె శివకుమార్ పేరును ప్రస్తావించడం పట్ల తన అభ్యంతరాలను వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ విజయాలను హైలైట్ చేయడానికి ఏర్పాటు చేసిన సమావేశంలో,

...మిగతాది 2 లో

## గుప్త నిధుల కోసం వేటగాళ్ళు తవ్వకాలు

### శిధిలావస్థలో 500 ఏళ్ళనాటి శివాలయం.. జీవం పోసేందుకు గ్రామస్తుల పోరాటం...



**జయభేరి, శ్రీ సత్యసాయి జిల్లా :**

రాయలకాలంలో రతనాల సీమ రాయల సీమ. ఇక్కడ నేటికీ గుప్త నిధుల కోసం వజ్రాల కోసం వేట కొనసాగుతూనే ఉంది. ఇలా గుప్త నిధుల కోసం 500 ఏళ్ల పురాతన ఆలయాన్ని వేటగాళ్ళు తవ్విపోస్తున్నారు. దీంతో తమ గ్రామానికి అలనాటి వైభవాన్ని చాటి చెప్పే గుడిని కాపాడమంటూ గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వ అధికారుల నుంచి సీఎం చంద్ర బాబు వరకూ అందరికీ ఆలయ చరిత్రని తెలియజేసి పునఃనిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా గౌరవన హళ్లి గ్రామంలో పురాతన శివాలయం ఉంది. జయమంగళి నది తీరంలో ఉన్న ఈ ఆలయం అలనాటి వైభవానికి గుర్తు. దీనిని విజయనగర రాజులు నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఈ ఆలయం శిధిలావస్థకు చేరుకుంది. దీనికి ముఖ్య కారణం ప్రభుత్వం ఆలయం అభివృద్ధి వైపు దృష్టి పెట్టకపోవడం ఒకటి అయితే.. మరొకటి గుప్త నిధుల కొడం వేటగాళ్ళు తవ్వకాలు.

...మిగతాది 2 లో

## యూకే, మాల్దీవులు పర్యటనకు మోదీ..

2 లో

## పచ్చని పల్లెల్లో.. చిచ్చు పెట్టేదెవరు..!?

2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## కర్నాటక రాజకీయాల్లో.. హైడ్రామా

స్వాగత ప్రసంగం సమయంలో డిప్యూటీ ముఖ్యమంత్రి శివకుమార్ పేరును ప్రస్తావించడాన్ని గుర్తు చేసినందుకు సిద్ధరామయ్య బహిరంగంగా కాంగ్రెస్ నాయకుడిని విమర్శించారు. స్పష్టంగా చిరాకుగా ఉన్న సిద్ధరామయ్య ప్రసంగాన్ని మధ్యలో ఆపి, "డికె శివకుమార్ వేదికపై కాదు, బెంగళూరులో ఉన్నారు. ఇక్కడ ఉన్నవారిని మాత్రమే మేము స్వాగతిస్తాము. ఇంట్లో కూర్చున్న వారికి మేము శుభాకాంక్షలు తెలియజేయలేము" అని అన్నారు. ఈ వ్యాఖ్య కాంగ్రెస్ నాయకులను దిగ్భ్రాంతికి గురిచేసింది. శివకుమార్‌కు దగ్గరగా ఉన్న ఒక సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ముఖ్యమంత్రి స్వరంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. "డికె శివకుమార్ లేకుండా, కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చేది కాదు. ముఖ్యమంత్రి చేయగలిగేది కనీసం ఆయనను గుర్తించడం, ముఖ్యంగా పార్టీ కార్యకర్త వేదికపై ఆయనను గుర్తు చేసినప్పుడు. ఆయన అంత దురుసుగా స్పందించాల్సిన అవసరం లేదు" అని ఆ నాయకుడు తెలిపారు. కర్ణాటకలో నాయకత్వ మార్పుపై కొంత కాలంగా ఊహాగానాలు చెలరేగుతున్నాయి, సిద్ధరామయ్య మద్దతుదారులు ముఖ్యమంత్రిగా ఐదేళ్ల పాటు పూర్తి కాలం పనిచేస్తారని చెబుతున్నారు. మరోవైపు, కాంగ్రెస్ పార్టీలోని శివకుమార్ మద్దతుదారులు "సరైన సమయం" వచ్చినప్పుడు ఉప ముఖ్యమంత్రి అత్యున్నత పదవిని చేపడతారని చెబుతున్నారు.

## గుప్త నిధుల కోసం వేటగాళ్ళు..

కను శిథిలావస్థకు చేరుకుంటున్న ఈ గుడిని కాపాడాలని ఆలయాన్ని తిరిగి పునః నిర్మించాలని ఆ ఊరి ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఈ ఆలయంలో శివలింగం చాలా ప్రత్యేకం**

ఈ ఆలయం బాలకృష్ణ ఎమ్మెల్యేగా ఉన్న హిందూపూర్ కు పది కిలోమీటర్ల లోపే ఉంటుంది. జయమంగళి నది తీరంలో 16వ శతాబ్దం లో విజయనగర రాజులు ఈ శివాలయాన్ని నిర్మించినట్టు చరిత్ర చెబుతోంది. అంటే ఈ శివాలయం నిర్మాణం... హిందూపూర్ లో ఉన్న లేపాక్షి ఆలయం నిర్మాణం దాదాపు ఒకేసారి జరినట్లు చెబుతున్నారు. విజయనగర రాజుల పాలన సమయంలో ఈ నదీ తీరంలో ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక ఉత్సవాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించే వారని ఆలయ ప్రాంగణం లోని శాసనాల ద్వారా తెలుస్తుంది. ఈ ఆలయంలో శివలింగం చాగంటి గారు చెప్పినట్లు బ్రహ్మ సూత్రంతో ఉంటుందని.. అందుకనే ఈ శివలింగం చాలా అరుదైనది.. ప్రత్యేకమైనదని గ్రామస్తులు చెబుతున్నారు. అంతేకాదు ఈ పురాతన శివాలయం విజయనగర రాజుల కాలం నాటి వాస్తు శిల్పకళా సంపదకి నిదర్శనం. నేటికీ ఈ ఆలయం లోని శిల్ప సౌందర్యం, ప్రాంగణం, ప్రాకారాలు, ఉయ్యాల మంటపం వీక్షకులను కట్టిపడేస్తాయి. ఈ శివాలయం పక్కన లక్కమ్మ అనే అమ్మవారి ఆలయం కూడా ఉంది. కాలక్రమంలో రాజులు పోయారు.. రాజరికాలు పోయాయి.. దీంతో ఈ ఆలయంపై శ్రద్ధ కూడా తగ్గింది. ఓ వైపు జయమంగళి నదీ ప్రవాహం వల్ల ఆలయం కొంత మేర దెబ్బతింది. మరోవైపు గుప్త నిధుల కోసం వేట గాళ్ళ తవ్వకాలు జరుపుకున్తుండడంతో మరింత శిధిలావస్థకు చేరుకుందని చెబుతున్నారు. కొంత మంది దుండగులు నిధుల మీద దురాశతో ఏకంగా శివలింగాన్నే తవ్వే ప్రయత్నం చేశారు. అప్పుడు గ్రామస్తులే శివలింగాన్ని మళ్ళీ ప్రతిష్ఠించి నిత్యం పూజలు చేస్తున్నారు. గ్రామస్తులు ఈ ఆలయానికి మళ్ళీ జీవం పోయాలని భావిస్తున్నారు. అందుకనే వైశాఖ మాసంలో ఏకాదశ మహా రుద్రాభిషేక ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇప్పటికే సత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్ కు గుడిని పునరుద్ధరించాలంటూ విజ్ఞప్తి చేసారు. అంతేకాదు ఆలయ నిర్మాణానికి అయ్యే ఖర్చుల్లో కొంత మొత్తం తాము భరిస్తామని కూడా చెప్పారు. మరోవైపు ఈ విషయాన్నీ సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లారు కూడా. ఏది ఏమైనా శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అని అంటారు. మరి ఆ శివయ్య తమ కోరికని ఎప్పుడు తీరుస్తాడో అని గ్రామస్తులు అధికారుల వైపు ఆశగా చూస్తున్నారు.

## యూకే, మాల్దీవులు పర్యటనకు మోదీ..



✍ **జయభేరి, న్యూఢిల్లీ, జూలై 20:**

ప్రధాని మోదీ విదేశీ పర్యటనలు కొనసాగుతున్నాయి. జూలై 23 నుండి 26 వరకు యూకే, మాల్దీవుల్లో మోదీ పర్యటించనున్నారు. యూకేతో ద్వైపాక్షిక చర్చలు, మాల్దీవుల 60వ సంవత్సర స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ప్రధాని పాల్గొంటారు. యూకే ప్రధాని కీర్ స్టార్మర్ ఆహ్వానం మేరకు మోదీ జూలై 23 - 24 తేదీల్లో ఆ దేశంలో పర్యటిస్తారు. బ్రిటన్‌లో ప్రధాని పర్యటించడం ఇది నాలుగవ సారి. రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ఇరు దేశాల ప్రధానులు చర్చలు జరుపుతారు. ప్రాంతీయ ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై చర్చలు జరపనున్నారు. యూకే పర్యటన సందర్భంగా కింగ్ చార్లెస్ III ను కూడా ప్రధాని కలుస్తారు. భారత్ - యూకే రెండు దేశాలు వాణిజ్యం ఆర్థిక వ్యవస్థ, సాంకేతికత, నూతన ఆవిష్కరణ, రక్షణ, భద్రత, వాతావరణం, ఆరోగ్యం, విద్య ,ప్రజా సంబంధాలపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం (CSP) పురోగతిని సమీక్షించనున్నాయి

**ప్రధాని మోదీకి మాల్దీవుల ఆహ్వానం**

జూలై 26న జరిగే మాల్దీవుల 60వ స్వాతంత్ర్య వార్షికోత్సవానికి తమ 'గౌరవ అతిథి'గా ద్వీప దేశాన్ని సందర్శించాలని ఆ దేశ అధ్యక్షుడు డాక్టర్ మొహమ్మద్ ముయిజు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించారు. జూలై 25 - 26 తేదీల్లో ప్రధాని మాల్దీవులను సందర్శిస్తారు. ద్వీప దేశంలో మోదీ పర్యటించడం మూడో సారి. సమగ్ర ఆర్థిక, సముద్ర భద్రతా భాగస్వామ్యం కోసం భారత దేశంమాల్దీవులు ఉమ్మడి ప్రణాళిక అమలు పురోగతిపై చర్చిస్తారు. ఈ మిషన్‌ను అక్టోబర్ 2024లో అధ్యక్షుడు ముయిజు భారత పర్యటన సందర్భంగా చేపట్టారు. ఇది భారత్ - మాల్దీవుల మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబిస్తుంది. భారతదేశం యొక్క 'నైబర్‌హుడ్ ఫస్ట్' విధానంలో మాల్దీవులు ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఈ పర్యటన ద్వైపాక్షిక సంబంధాన్ని మరింతగా పెంచుకోవడానికి, బలోపేతం చేయడానికి అవకాశాన్ని అందిస్తుంది.

**పార్లమెంట్ సమావేశాలు వదిలేసి విదేశీ పర్యటనలా !**

ప్రధాని మోదీ రెండు దేశాల పర్యటన ఖరారైన నేపథ్యంలో ప్రధాని విదేశి పర్యటనను కాంగ్రెస్ విమర్శలు గప్పించింది. పార్లమెంటు సమావేశాలు జరిగే సమయంలో విదేశాలకు వెళ్లడం ఏంటని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ప్రజా సమస్యలు, ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలకు భయపడి మోదీ విదేశాకు వెళ్తున్నారని ఎద్దేవా చేస్తున్నారు. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్, ట్రంప్ వ్యాఖ్యలు, దేశ భద్రత, విదేశాంగ విధానం గురించి పార్లమెంట్ వేదికగా ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్న తరుణంలో మోదీ విదేశీ పర్యటన చర్చనీయాంశంగా మారింది.

# పచ్చని పల్లెల్లో.. చిచ్చు పెట్టేదెవరు..!?

**స్థానిక ఎన్నికల్లో సంబంధాలు మరచి బాహ..బాహి..! బడుగు బలహీనుల బతుకుల్లో రాజకీయ పార్టీల విష ప్రచారం.. పాడైపోతున్న మానవ సంబంధాల పర్వం. షెడ్యూల్ తరగతుల వారికి దక్కని అధికారం..!? కుల మత విద్వేషాలతో ఒకరినొకరు ఓర్చుకోలేని తత్వం.. నీది ఆ.. పార్టీ..! నాది ఈ.. పార్టీ...! నీతిమాలిన చేష్టలు.! పనికిమాలిన కొట్లాటలు..! పల్లెల్లో నిర్వీర్యమ వుతున్న మానవ సంబంధాలపై "జయభేరి" సగర్వంగా అందిస్తున్న కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ సీనియర్ జర్నలిస్టు రాజకీయ సమగ్ర విశ్లేషణ..!?**

✍ **జయభేరి, హైదరాబాద్ :**



పల్లె సీమలే దేశానికి పట్టుగొమ్మలు. అని ఒకనాటి మాట. కానీ ఈరోజు జరుగుతున్న పరిణామాలు ఒక్కసారి విశ్లేషించుకుంటే కాంక్రీట్ రోడ్లు, కరెన్సీ కట్టలు, కనుమరుగవుతున్న మానవ సంబంధాలు. ఒక నేనొకడు అన్నదమ్ముల వాళ్ళ ప్రేమించుకొనుడి అని ప్రతిజ్ఞ చేసి చిన్నప్పుడు చదువుకున్న మనమే రాజకీయ పార్టీల ఉచ్చులో పడి సమిధులుగా మారిపోతున్నాం. అందరూ తెలివికల్ల వాళ్లే కానీ రంగు జెండాల మాటున రెండు ముఖాల రాక్షసత్వం చూపిస్తున్న వరస పచ్చని పల్లెల్లో ప్రత్యక్షంగా కనిపిస్తోంది. ఎవ్వడు ఏమైపోతే నాకేంటి నా ఇల్లు బాగుండాలి అనే స్వార్థ భూతం రాజకీయ పార్టీల రంగు జెండాల్లో దాగి అన్న, తమ్ముడు అని పిలుచుకునే ఆ చోట విషం చిమ్ముతుంది. మానవ సంబంధాలు విషత్ కౌగిరిలో ప్రాణాలు విడుస్తున్నాయి. ఒకప్పుడు రాజకీయం వేరు. ఇప్పుడు రాజకీయం వేరు. ఎందుకంటే అప్పుడు ఎక్కువగా చదువుకోకపోయినా మనిషి మనిషికి విలువనిస్తూ ఎన్నికలు అయిపోగానే ఎవ్వరు పనుల్లో వారు మునిగిపోతూ ప్రతి ఒక్కరిని ప్రేమగా ఆప్యాయంగా తెలుసుకొని పనులు చేసుకుని సహజీవనం చేసుకునేవారు. కానీ ఇప్పుడు ఆధునిక సాంకేతిక జీవన విధానంలో చిన్న పెద్ద తేడా లేకుండా రంగు జెండాలను ఒంటికి చుట్టుకొని ఆ ఫలానా నాయకుడికి జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ తన కుటుంబాన్ని సైతం విడిచేస్తూ తన తోటి వారిని పగవారిగా చిత్రీకరిస్తూ అధికారం కోసం సైనికులుగా మారి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు.

ఒకప్పుడు తులమత బేధాలు అంటరానితనాలు ఎక్కువగా ఉన్న రోజుల్లో మనిషి పట్ల ఒకింత గౌరవం పిలిచే విధానం ఎబ్బెట్టుగా ఉన్న రాజకీయ రణరంగంలో ఉన్న ఆకాసేపే నువ్వు వేరు నేను వేరు అనే తత్వం దాగుండేది. ఎన్నికలు అయిపోయిన తర్వాత పొద్దున్నే పని కోసం పిలిచే పిలుపులతో పనిలో జీవనం కొనసాగిపోయేది. కానీ నేడు జరుగుతున్నది ఏంటి? ఓ నాయకుడికి విజయాన్ని తెచ్చి పెట్టడానికి గ్రామాల్లోని పచ్చని పల్లెల్లో నివసించే మనుషుల్లో విషాన్ని నూరిపోస్తుంది మనమే కాదా... నాయకుడు ఇచ్చే మందు డబ్బు సంక్షేమ పథకాల ఎర..!? వీటిని పేద ప్రజలకు ఆశ చూపించి వారి దగ్గర నుంచి ఓట్లు రాబట్టుకోవడానికి మన కుటుంబంలోని వారిని ఆ రాజకీయ పార్టీ నాయకుడు సైనికుడిగా ఎంచుకొని వాడితోటే మన ఓట్లు కొల్లగొట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాజకీయ పార్టీ ఏదైనా సరే రంగుల జెండాలు మెడకు చుట్టుకొని తమ ప్రాణాన్ని తామే తీసుకునేలా పల్లెసీమలోని యువత పెద్దలు అనుభవజ్ఞులు పూర్తిగా మాయలో పడిపోతున్నారు. రాజకీయమంటే రాజీ లేకుండా ప్రజా సంక్షేమం కోసం ప్రజల కోసం ఎలాంటి స్వార్థం లేకుండా నేను సేవ చేస్తాను అని ఈ రంగంలోకి రావడం. కానీ నిర్వచనాలు మారిపోతున్నాయి తెల్ల చొక్కా వేసుకున్న మనుషులు విషం పూర్తిగా నిండి ఎవర్ని ఎక్కడ ఎలా తొక్కాలి ఎలా వాడుకోవాలి అనే ఆలోచనలతో పల్లె వాతావరణంలో పూర్తిగా కలుషితం చేస్తున్నారు. అసలే స్థానిక ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో పల్లె సీమల్లో విద్వేషం స్వార్థం అన్నదమ్ముల పోటీ పడుతున్నాయి.

త్వరలో రాబోతున్న స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటి నుంచే పల్లె సీమల్లో రాజకీయ పార్టీల పెద్దలు నియమించిన వారు ఒక్కొక్కరు ఒక్కొక్క కులాన్ని ఎంచుకొని వారిని తమ వైపు మళ్ళించుకోవడానికి రాజకీయ పార్టీల సేవకులుగా సిగ్గులేని పనులు చేస్తున్నారు. ఎందుకో తెలుసా..!? మేము ప్రచారం చేసే పార్టీ గెలిస్తే మీకు రేషన్ కార్డులు ఇస్తాం పింఛన్లు ఇస్తాం ఉండడానికి ఇల్లు ఇస్తాం! అని చెప్పిన పెద్దలే... సంక్షేమ పథకాల్లో గద్దల్ల వాలిపోయి.. మేము పార్టీ విజయం కోసం పనిచేయలేదా? మాకు రాకపోతే ఎవరికి ఇవ్వాలి? మీరు ఓట్లు డబ్బులు తీసుకుని వేశారు కదా? అంటూ ఎదురు దానికి దిగే రాజకీయం ఇప్పుడు ఫ్యాషన్ అయిపోయింది. పచ్చని పల్లెల్లో ప్రశాంతమైన వాతావరణంలో కులమత బేధాలు మరిచి మానవులంతా వరసలు కలుపుకొని ఆప్యాయంగా పలకరించే పలుకులు నేడు కనుమరుగవుతున్నాయి. రాజకీయ పార్టీల మాయలో పడి ఆ రాజకీయ పార్టీలకు విజయాన్ని తెచ్చి పెట్టడానికి మానవ సంబంధాలను బలి పెడుతున్నారు. గ్రామంలో నివసిస్తున్న వారిలో ఎక్కువగా ఎవరు పనిచేశారు అనే విషయం ఆ గ్రామ ప్రజలకు పూర్తిగా తెలుస్తుంది. కానీ అలాంటి వారిని సైతం మార్చేసే సుపుత్రులు వారు కన్న పిల్లలే... నీకేం తెలవదు. నీకేం అర్థం కాదు. ఒక అప్పటి నీ కాలం గాదు ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి.

మా నాయకుడు వస్తే బాగుపడతాం. నీకెందుకు నువ్వు గమ్మున కూర్చో.. అంటూ హితబోధ చేసే 25 నుంచి 30 సంవత్సరాల సీనియర్ సిటిజెన్సే ఈ మాటలు చెబుతూ పెద్దవారిని నోరుమూపించేలా చేస్తున్నాయి. ఒకప్పుడు కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే గ్రామాల్లో ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచి పోయింది. ఆ తర్వాత కాంగ్రెస్ కూటమి పూర్తిగా కాంగ్రెస్ పార్టీగా మారిపోయింది. అసలు కాంగ్రెస్ అంటే అర్థం తెలియని వాళ్లే మేము నాయకులం లీడర్లు అంటూ పచ్చని పల్లె సీమల్లో విషాన్ని నోరు పోస్తున్నారు. స్వాతంత్ర సంగ్రామంలో మోహన్ దాస్ కరంచంద్ గాంధీ స్వాతంత్ర కాంక్షను నెరవేర్చడానికి ఒక కూటమిని ఏర్పాటు చేసి దాని ద్వారా పోరాటాన్ని కొనసాగించారు. దానికి పెట్టిన పేరే కాంగ్రెస్... రాను రాను అది కాంగ్రెస్ రాజకీయ పార్టీగా మారిపోయింది. అది పేదల పార్టీగా నిలిచి పోయింది. కానీ మారుతున్న కాలానికి ఆ పార్టీలోని నాయకులు మారారు. పార్టీ ఎవరి చేతుల్లోకి వెళ్లిందో అందరికీ తెలుసు. ఇక కమ్యూనిస్టు పార్టీ.. ప్రజల నరనరాల్లో ఎర్రని రక్తంలో ప్రవహించే విధంగా ఆరోజు ప్రజల మనసుల్లో కమ్యూనిస్టు పార్టీ విజయ దంకా మ్రోగించింది. కానీ ఆ పార్టీలో కూడా ఎవరెవరు అధికారాన్ని దక్కించుకున్నారో అందరికీ తెలుసు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో రాజకీయ పార్టీలు రూపాంతరం చెందుతూ రంగురంగుల గుర్తులు పొందుతూ పచ్చని పల్లెల్లో ఉన్న మానవ



✍ **కడారి శ్రీనివాస్**
**సీనియర్ జర్నలిస్ట్ (జయభేరి),**
**తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఎడిటోరియల్ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత, కవి, గాయకుడు,**
**రచయిత, సామాజిక ఉద్యమకారులు**

సంబంధాలను విడగొట్టే బుద్ధికి శ్రీకారం చుట్టాయి. గ్రామాల్లో స్థానిక ఎన్నికల్లో సర్పంచి ఫలానా వాడైతే బాగుంటుంది అనేక అభిప్రాయానికి వచ్చే గ్రామమే కనిపించడం లేదు. ఆ గ్రామంలో ఫలానా వాడిని సర్పంచిగా నియమిద్దాము అని అనుకుంటే ప్రతి గ్రామంలో కొన్ని అగ్రకులాల పెత్తనం శాసిస్తుంది. మరికొన్ని గ్రామాల్లో ఆ ఫలానా కులం వాడ!? వాడు మనకు సర్పంచ్ గా ఉండాలా...!? చి చి అంటూ చీదరించుకునే దౌర్భాగ్యపు మనుషులు ఉన్న పల్లెల్లో ఎక్కడ సమానత్వం కనిపిస్తుంది? ఇలా విద్వేష పూరిత ఆలోచనలను కల్పించింది ఎవరు? రంగు జెండాలు మార్చుకున్న రాజకీయ పార్టీలే!?

రాజకీయంగా చట్టసభల్లో కూర్చుని బడుగు బలహీనుల అభివృద్ధి కొరకు మనమే రాజకీయంలోకి వెళ్లి అధికారాన్ని దక్కించుకొని శాసనాలు చేసే చోట మనమే నాయకులుగా నిలబడి మన ప్రజల కోసం శాసనాలు నిర్మించుకోవాలి అని ఆశపడి రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలు ఇవ్వాలా అగ్రవర్ణాల నాయకుల కాళ్ళ కింద బానిసల బతుకుతున్న నేతలు మన గ్రామాల్లో మన నాయకులుగా చలామణి అవుతున్నారు. అంబేద్కర్ ఆత్మ గోషించడం లేదా...!? పచ్చని పల్లెల్లో పలకరింపులు కరువైపోతున్నాయి..? వీడు ఆ పార్టీ వాని కొడుకు? వాడు ఏమైనా అంత పెద్ద తోప? అంటూ కలిసి చదువుకున్న స్నేహితులే వక్రీకరించే మాటలు!? ఎక్కడ పోతున్నాం..? ఏమైపోతున్నాం...?

మనిషి ఎదుగుదల శాశ్వతంగా ఉంటుందా? స్వార్థం నరనరాన నిండి చిన్నప్పటి నుంచి కలిసి పెరిగిన స్నేహితులే విడదీసి వక్రీకరించే మాటలు మాట్లాడుతుంటే కులమత విద్వేషాలను రెచ్చగొడుతూ పార్టీ సిద్ధాంతాలను ఊపిరిగా పెంచుకొని సంబంధాలను తుంచుకుంటుంటే పచ్చని పల్లెల్లో పచ్చదనం ఎక్కడ ఉంటుంది!?



కులం మతం జాతి వర్గం ప్రాంతం ఇవన్నీ ఒకప్పుడు ఉండేవి అని భ్రమ పడిపోయాం. కానీ నేటికీ పల్లెల్లో ఈ భిన్నాభిప్రాయాలు భేదాభిప్రాయాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ఎందుకంటే స్థానిక ఎన్నికలే దీనికి ప్రధాన సాక్ష్యంగా నిలిచే అవకాశం లేకపోలేదు. ఫలానా ఆ కులం వాడు సర్పంచ్ గా చూడాలా అనే హేయమైన నీచమైన బుద్ధి ఈనాటి పచ్చని పల్లెల్లో నివసించే ప్రజల్లో రాక్షసత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి. భారతీయులందరూ నా సహోదరులు నేను నా దేశమును ప్రేమిస్తున్నాను అని చేసిన ప్రతిజ్ఞ ఆరోజే మరిచిపోయినట్టుంది. అందరూ సమానమే అని చెప్పిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం అందరికీ సమానంగా అందుతుందా..!? స్థానిక ఎన్నికల్లో నిజానికి బడుగు బలహీనులకే అధికారం కట్టబెట్టాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల మధ్య నివసిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ విద్యార్థులకు అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరిని పలకరిస్తూ సహాయం చేసే మనస్తత్వం గల వాడికే ఓటేసి ప్రజలు గెలిపించాలి.



**కరెన్సీ కట్టలకో మందుకో బీరు బిర్యానీకో ఆశపడి అగ్రవర్ణాల పార్టీల నాయకులను నమ్మి ఓటు అమ్ముకుంటే బిచ్చగాళ్లను అయిపోక తప్పదు. స్థానిక ఎన్నికలు కేవలం ప్రజల మధ్యలో నివసించే వారికే అధికారాన్ని కట్టబెట్టాలని ఉద్దేశంతోటే ఆనాడు బిఆర్ అంబేద్కర్ స్థానిక ఎన్నికల్లో బడుగు బలహీనులకు షెడ్యూల్ తరగతుల వారికి ఎన్నికల్లో రిజర్వేషన్ కనిపించారు!? కనీసం రిజర్వేషన్ అంటే అర్థం తెలియని వాళ్లు సైతం నేను ఫలానా పార్టీ లీడర్ ని అని విర్రవీగే అలాంటి వాళ్లకు బుద్ధి చెప్పాలి అంటే షెడ్యూల్ కులాల వారిని అగ్రస్థానంలో నిలబెట్టాల్సిన బాధ్యత పల్లెల్లో నివసించే స్వచ్ఛమైన ప్రజల అభిప్రాయం మాత్రమే. పచ్చని పల్లెల్లో విషం చిమ్మే రాజకీయ పార్టీల అసలు రంగును బయటపెట్టే బాధ్యత ప్రజలపైనే ఉంది. ప్రజల్ని ప్రతినిత్యం రాజకీయంగా చైతన్య పరుస్తూ చదువుకున్న యువత బాబాసాహెబ్ అంబేద్కర్ వారసులుగా ప్రథమ స్థానంలో కర సేవకులుగా పని చేయాలి. రాజ్యాంగం యొక్క స్వరూపాన్ని మార్చేస్తున్న ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో ప్రజలకు నిత్యం తోడుగా ఉంటూ ఎలాంటి స్వార్థానికి లొంగని వారిని సర్పంచులుగా వార్డు మెంబర్గా ఎన్నుకునే విషయంలో ప్రజలు తమ సొంత నిర్ణయానికి కట్టుబడి పని చేయాలి. ఎలాంటి లాభాపేక్షకు తావివ్వకుండా ఓటు వేసే సమయంలో మాత్రం స్వచ్ఛమైన మనసుతో పరిపూర్ణ ఆలోచనలతో ఎలాంటి స్వార్థానికి లొంగకుండా ఓటును ఇష్ట పూర్తిగా వినియోగించుకోవాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పల్లెలే రాష్ట్ర స్వరూపాన్ని నిర్ణయిస్తాయి కాబట్టి తెలంగాణ నియోజకవర్గాల్లో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలు స్వతంత్రంగా ప్రజలు ఆలోచన నిర్ణయం తీసుకుంటారని ప్రధానంగా నమ్ముతూ రాజ్యాంగం సాక్షిగా ప్రమాణం చేస్తూ మన రాజ్యాంగాన్ని మనం కాపాడుకుందాం ఎలాంటి స్వార్థమైన ఆలోచనలకు పోకుండా పల్లెల్లో పచ్చని వాతావరణన్ని నిర్మించుకుందాం. రాబోయే భవిష్యత్తుకు ఓ మంచి వాతావరణాన్ని అందించే ప్రపంచాన్ని అందిద్దాం...**

# అమ్మవారికి బోనం సమర్పించిన కార్పొరేటర్ బన్నాల గీత

- అమ్మవారి ఆశీస్సులు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలపై ఉండాలి : కార్పొరేటర్ బన్నాల

జయభేరి, ఉప్పల్ :




ఆషాడం మాసం బోనాల పండుగను పురస్కరించుకొని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ కుటుంబ సమేతంగా బ్యాంక్ కాలనీ అమ్మవారీ ఆలయంలో అమ్మవారికి బోనం సమన్పించారు. అనంతరం గీతా ప్రవీణ్ మాట్లాడుతూ.. ఆషాడ మాస బోనాల పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారికి బోనం సమర్పించడం జరిగిందని తెలుపుతూ అమ్మవారి ఆశీస్సులు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలపై ఉండాలని, అదేవిధంగా అమ్మవారి ఆశీస్సులు తెలంగాణ రాష్ట్రం తొలి ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రివర్యులు కేటీఆర్,హరీష్ రావు, ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి పై ఉండాలని కొని ఆడారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ని శాలువాతో సత్కరించి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశం, బాబున్న, సందీప్ భూషణ్ ,శ్రీనివాస్, మనోజ్ , రమేష్, శేఖర్, ప్రదీప్, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## లంకెలపాలెం జంక్షన్లో మరో ప్రమాదం

- ప్రమాదంలో మహిళా మృతి

జయభేరి, పరవాడ:

జీవిఎంసి పరిధిలో లంకెలపాలెం రంగనాయక నగర్ కాలనీకి చెందిన దాసరి ఆదిలక్ష్మి (60) అనే మహిళ ట్రాఫిక్లో ఇటు నుంచి అటు రోడ్డు దాటుతుండగా లంకెలపాలెం జంక్షన్ లో లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది ఇది చూస్తున్న ప్రజలు అందరూ ఒక్క సారిగా భయభ్రాంతులు అయ్యారు.

## అయ్యా ఎమ్మెల్యే సారూ ఈ రహదారికి దారి చూపండి

- మూడు నెలలుగా వాడకంలో లేని ఫార్మాసిటీ ప్రధాన రహదారి



జయభేరి, పరవాడ:

అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో లంకెలపాలెం నుండి పరవాడ వైపుగా వెళ్లే ప్రధాన రహదారి మొన్న పడిన వర్షాలకి గుంతలు గుంతలుగా మారి అటుగా వెళ్లే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణం చేస్తూ ఉన్న ఈ రహదారి గురించి మూడు నెలలుగా వాడకంలో లేకపోయినా నాయుకులు,పాలకులు పట్టించుకొన్న రోజులు లేవు.కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత సంక్రాంతి సంబరాలు అంటూ తూతూ మంత్రంగా మార్మతులు చెయ్యించిన రహదారి మూడు నెలలు తిరగక ముందే ఇలా తయారవ్వడం స్థానిక ప్రజానీకానికి ఆశ్చర్యం కల్గిస్తుంది.ప్రభుత్వ కార్యక్రమాలకి అధికారులు నాయుకులు ఈ రహదారి గుండా ప్రయాణం చేస్తున్న ప్రజలు పడుతున్న ఇబ్బందులు కనపడకపోవడం నాయుకులకు ఈ ప్రాంతం పై ఉన్న శ్రద్ధ ఏ మాత్రమో అర్ధం పడుతుంది.ఇప్పటికయినా స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల సమస్యపై స్పందించి రహదారికి పూర్తి మార్మతులు చేసే చర్యలు చేపట్టాలని ప్రయాణికులు,ప్రజలు కోరుతున్నారు.



# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

## తాడిపత్రి ప్రభుత్వ పాఠశాలలో నిండిన ఆనందం

- తాడిపత్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2014 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- ఆనందాన్ని పంచుకున్న సింగర్ వరలక్ష్మి
- పాత మిత్రుల కలయిక 2014 10వ తరగతి చదువుకున్న విద్యార్థుల పూర్వ సమ్మేళనం.

జయభేరి, అనంతపురం :




పాత జ్ఞాపకాలు ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి. అందులో 2014లో చదువుకున్న పదవ తరగతి విద్యార్థిని విద్యార్థుల కలయిక ఎంతో ఆనందాన్ని కలిగించిందంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు 2014 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు. ఈ సందర్భంగా అనంతపురం డిస్టిక్ తాడిపత్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో2014 సంవత్సరం చదివిన విద్యార్థులు 10 సంవత్సరాల తర్వాత సామూహిక సమ్మేళనం జరుపుకున్నారు. Pt ప్రసాద్ సార్ వచ్చి గెట్ టుగెదర్ పార్టీని విజయవంతం చేశారు. విద్యార్థినీ విద్యార్థులు అందరూ కలిసి పూర్వం జ్ఞాపకాలు నెమరు వేసుకొని ప్రస్తుతం వాళ్లు చేసేటువంటి పనులను ఒకరికొకరు పరిచయం చేసుకున్నారు.పిటి ప్రసాద్ సార్ గారికి విద్యార్థులు శాలువా కప్పి గౌరవంతో సన్మానం చేశారు. ఈ ప్రోగ్రాంకు ముఖ్య పాత్ర వహించిన అస్లాంకు ధన్యవాదాలు తెలిపిన ఫ్రెండ్స్. ఒకరినొకరు ప్రేమపూర్వకంగా పలకరించుకుంటూ ఎవరెవరు ఏం చేస్తున్నారు అంటూ ఎన్నో అనుభవాలను చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. నిజంగా ఆనాటి అనుభవాలు మరపురానివి మరచిపోలేనివి.

# కాలనీ అభివృద్ధి కోసం కృషి చేస్తా..

- దేవేందర్ నగర్ ఫేజ్ 2 అధ్యక్షుడిగా చిన్నం గణేష్

జయభేరి, మేడిపల్లి :



బోడుప్పల్ కార్పొరేషన్ 13 వ డివిజన్ దేవేందర్ నగర్ ఫేజ్ 2 కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా చిన్నం గణేష్ విజయం సాధించాడు. అదివారం కాలనీ అసోసియేషన్ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఎన్నికల అధికారులు ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పదవికి ఇద్దరు అభ్యర్థులు పోటి పడగా చిన్నం గణేష్ కు 220 ఓట్లు రాగ సమీప ప్రత్యర్థి భగవంతం కు ఓట్లు 36 పోలాయ్యాయి,చెల్లని ఓట్లు పోలినట్లు తెలిపారు. ఈ మేరకు ఎన్నికల అధికారులు బైరుగొండ మల్లేష్, సీసాల సత్తయ్య,చల్లా నరసింహులు ,రవి,సుధాకర్ లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. అనంతరం చిన్నం గణేష్ విజేతగా నిలిచినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ కాలనీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి దోహద పడిన కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, పోగుల నరసింహ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ 13 వ డివిజన్ ఇంచార్జ్ జెన్న రాజు లకు ధన్యవాదాలు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.

# గోరింటాకు విశిష్టత తెలుపుతూ సమరసత సేవా ఫౌండేషన్ కార్యక్రమం

జయభేరి, పరవాడ:



సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవాడ సబ్ డివిజన్ కూర్మన్నపాలెం లో యమ్ వి ఆర్ అపార్ట్మెంట్లో శ్రీ వెంకటేశ్వర దేవాలయం కేంద్రంగా మహిళా విభాగం మహిళా కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి మాట్లాడుతూ ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు విశిష్టత గురించి మాట్లాడం జరిగింది. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేవాలయం కేంద్రంగా భజన సత్సంగం పౌర్ణమికి సామూహిక హారతి ఆత్మీయ బంధువులు కలవడం గురించి మాట్లాడం జరిగింది. గోరింటాకు ఉపయోగాలు, ఈ ఆషాఢమాసం లో ఎందుకు పెట్టుకోవాలని అంటే నేలలో తేమ ఎక్కువగా ఉంటుంది వర్షం తో నేలలో చిత్తడిగా ఉంటుందని అందు వలన ఎక్కువ వైరస్, క్రిమికీటకాలు ఎక్కువగా ఉంటాయని అందువల్ల చేతులకు గోరింటాకు పెట్టుకుంటేనే వైరస్ చనిపోయి ఆరోగ్యంగా ఉంటూ చర్మం బాగుటుందని పూరాణాలలో గోరింటాకు విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిమాంధ్రి కుమారి , యమ్ సుశీల, ఎన్ లక్ష్మి, పి రామచంద్రరావు, పరవాడ సబ్ డివిజన్ ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు, అధిక సంఖ్యలో మాతృమూర్తులు తదితరులు పాల్గొన్నారు.



## సికింద్రాబాద్ లష్కర్ బోనాలు

జయభేరి, పార్శిగుట్ట :

సికింద్రాబాద్ లష్కర్ బోనాలు పార్శి గుట్ట ప్రాంతంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రతి గడప నుంచి ఒక్కొక్క బోనాన్ని అమ్మవారికి సమర్పిస్తూ వ్యాధి రోగాల నుండి చల్లగా కాపాడు తల్లీ అంటూ అమ్మవారికి కొత్త కుండలో కుంకుమ పసుపు బొట్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో చిన్న పెద్ద కుల మత భేదాలు మరిచి లష్కర్ బోనమెత్తింది. వివిధ ప్రాంతాల్లో అమ్మవారి ఆలయాలు కిక్కిరిసిపోయాయి. భారీ ఎత్తున మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు మొక్కుకున్నారు. సందర్భంగా పార్సిగుట్ట ప్రాంతంలో అనేకమంది మహిళలు అమ్మవారి గుడికి బోనం ఎత్తుకొని చేరుతూ శిగాలు ఊగుతూ అమ్మవారిని ఆవాహనం చేసుకొని అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకొని బోనాలను సమర్పించారు.



## మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం



జయభేరి, నల్గొండ :


కేతేపల్లి మండలం కోర్లపహాడు గ్రామం నీరు పేద కుటుంబానికి చెందిన ఎడ్ల సైదులుకి పెళ్లి అయ్యి 4 సం.కూతురు ఉంది. సెంట్ భూమి లేదు.. ఉండటానికి చిన్నపాటి రేకుల ఇంట్లో జీవనం సాగిస్తున్న క్రమంలో లివర్ సంబంధించిత వ్యాధితో బాధపడుతూ, కిడ్నీలు కూడా పాడు అయి పోయిన సైదులు నీ నల్గొండ లోని నవ్య హాస్పిటల్ లో వైద్యం చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వెంటిలేటర్ మీద ప్రాణాపాయ స్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు. ఉన్న ఇల్లు కూడా అమ్మి ట్రీట్మెంట్ అందిస్తున్నారు. ఆపన్నహస్తం కోసం మన ప్రాణ దాతలు ఫౌండేషన్ నీ సంప్రదించగా మానవతా దృక్పథంతో స్పందించి 10,000 /రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలుపుతూ, ఈ కార్యక్రమంలో ప్రాణ దాతలు ఫౌండేషన్ వ్యవస్థాపకులు మేరుగుమల్ల రాజ్, కోర్లపహాడ్ సర్పంచ్ ఎడ్ల రమేష్, ఎంపీటీసీ ఎడ్ల ప్రవీణ్, లింగరాజు తదితరులు పాల్గొన్నారు...

## అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి సీతక్క



జయభేరి, మహేశ్వరం :

తెలంగాణ రాష్ట్ర పండుగ బోనాల పండుగ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ పరిధిలోని ఖిల్లా మైసమ్మ అమ్మవారిని దర్శించుకోని రాష్ట్ర ప్రజా ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు సమర్పించిన తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి మంత్రి సీతక్క, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, NSUI నాయకులు, మహిళా అధ్యక్షురాలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మన ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డితో కలిసి, బోనాల పండుగ సందర్భంగా, మన మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పోచమ్మ తల్లి ఆలయాలను సందర్శించి, పూజా కార్యక్రమాలలో పాల్గొనడం జరిగింది. దయగల తల్లి దీవెనలు అందరిపై ఉండాలని, చెడుపై విజయాన్ని సాధించే బలాన్ని ప్రసాదించాలని కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మన డివిజన్ సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ వారు, యువత, భక్తులు పాల్గొన్నారు.

జయభేరి, ఎల్బీనగర్





## పల్లె పహాడ్ లో ఘనంగా బోనాల పండుగ

జయభేరి, తుర్కపల్లి, జూలై 20 :

తుర్కపల్లి మండలం పల్లె పహాడ్ గ్రామంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అన్ని కుటుంబాలు ఆషాడ మాసం చివరి మాసం సందర్భంగా మహిళలు గ్రామ దేవతలకు బోనాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## టేకులగూడెం బోడగుట్ట వద్ద లారీ ప్రమాదం



జయభేరి, వెంకటాపురం, జూలై 20 :

ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగూడెం వద్ద, చత్తీస్గఢ్ సరిహద్దులో ఉన్న బోడగుట్ట ఘాట్ రోడ్డులో ఆదివారం ఉదయం ఓ లారీ ప్రమాదానికి గురైన సంఘటన చోటు చేసుకుంది. చత్తీస్గఢ్ వైపు నుంచి ఐరన్ లోడ్తో వస్తున్న లారీ, ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి కొండ కిందికి దూసుకు పోయింది. అయితే అప్రమత్తమైన డ్రైవర్, క్లీనర్ లారీ క్యాబిన్ నుండి దూకడంతో వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. లారీ బండరాయిని తాకడంతో బోల్తా కొట్టకుండా అక్కడే నిలిచి పోయింది. ఈ ఘటనలో పెద్ద ప్రమాదం తప్పినట్టయింది.

## ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవంను జయప్రదం చేయండి



జయభేరి, చర్ల జులై 20 :

చర్ల మండల కేంద్రంలో ఆదివారం నాడు గొండ్వాన సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో అన్ని గ్రామ పంచాయితీలలో పర్యటించి, సుబ్బంపేట గ్రామంలో ఆదివాసులతో మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీల హక్కుల ఉల్లంఘన జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఆగస్టు 9 న ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమాలు ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తున్నారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు షెడ్యూల్ ఏరియా చట్టాలను ఏమాత్రం ఆదివాసుల సంక్షేమం, చట్టాల అమలు కోసం రాజకీయ పార్టీ ల శాసనసభ్యులు మంత్రులు పనిచేయడం లేదని విమర్శించారు. షెడ్యూల్ ఏరియాలో ఉన్న ఆదివాసి యువత మొత్తం భవిష్యత్తు ఉద్యమాలకు నడుము బిగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ, చర్ల వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్, ఇర్ప ప్రకాష్ ఏక సురేంద్ర, కాక రాంబాబు, యలం రమేష్, యాక సూరిబాబు, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైశ్య రణభేరి సభ పోస్టర్ ఆవిష్కరణ

- ఆగస్టు 3న జరుగు వైశ్య రాజకీయ రణభేరి సభను విజయవంతం చేయండి



జయభేరి, చింతపల్లి :

చింతపల్లి మండల కేంద్రంలో వైశ్య రాజకీయ రణభేరి సభను విజయవంతం చేయండి పోస్టర్ ఆవిష్కరణ చేసిన చింతపల్లి మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు వందనపు ఆంజనేయులు ఆర్యవైశ్యులు కేవలం సమాజ సేవలోనే కాకుండా రాజకీయాలను కూడా శాసించే విధంగా రాణించాలని వైశ్య రాజకీయ రణభేరి వ్యవస్థాపకులు, మలిదశ ఉద్యమకారులు డా.కాచం సత్యనారాయణ పిలుపుమేరకు పోస్టల్ ఆవిష్కరణ చేసినారు. ఈ సందర్భంగా వారు వందనపు ఆంజనేయులు మాట్లాడుతూ ఆర్యవైశ్య జనాభా ప్రకారం ఆర్యవైశ్యులకు అన్ని రంగాలలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రేపు జరగబోవు ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు అన్ని రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పోరాటాలకు ఖిల్లా అని, ఆగస్టు 3న హైదరాబాదులో జరిగే రాజకీయ రణభేరి సభకు పెద్ద ఎత్తున తరలి వచ్చి పాలకులకు మన సత్తా ఏమిటో చూపాలన్నారు. పార్టీలకతీతంగా జరుగు ఈ రణభేరి సభకు పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు తరలిరావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వందనపు ఆంజనేయులు, చింతపల్లి మాజీ సర్పంచ్ ముచ్చర్ల గిరి ,కొర్వి గిరి ,దాచేపల్లి మధు, వంగాల రమేష్, కొర్వి రాధాకృష్ణ, కొమిరిశెట్టి వినోద్, ఆగుతోట జంగయ్య, కుంచకూరి రాము, తేరటుపల్లి కిషోర్, బచ్చు సురేష్, కొమిరిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు రెండు తోడు దొంగలన్న నిజాన్ని ప్రజలు గమనించాలి

- ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని కాంగ్రెస్ పార్టీని స్థానిక ఎన్నికల్లో చిత్తుగా ఓడించండి
- బెహన్ మాయావతి స్ఫూర్తి తోటి మహిళలు శక్తివంతంగా రాజకీయాలు చేయాలి
- మహిళలకు రాజ్యాధికారంలో సమాన వాటా కల్పించే బహుజన్ సమాజ్ పార్టీకి అధికారం ఇవ్వాలి



జయభేరి, చర్ల, జూలై 20 :

చర్ల మండలంలో సత్యనారాయణపురం బహుజన్ సమాజ్ పార్టీ సెక్టార్ సమావేశం పార్టీ చర్ల మండలం కార్యదర్శి సామల ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి బీఎస్పీ పార్టీ భద్రాచలం నియోజకవర్గం ఇన్చార్జి శ్రీమతి గుర్రాల దుర్గాభవాని హాజరయ్యారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో మాయమాటలు చెప్పి మహిళల ఓట్లు దండుకొని రాజ్యంలోకి వచ్చిందని ప్రభుత్వం ఏర్పడి ఇంతకాలం అవుతున్న ఇప్పటివరకు ఆ హామీలను నెరవేర్చిన పరిస్థితి లేదని విమర్శించారు కళ్యాణ్ లక్ష్మి తో పాటు తులం బంగారం ఇస్తామని, స్కూటీలు ఇస్తామని ప్రతి మహిళకు 2500 రూపాయలు ఆర్థిక సహకారం అందిస్తామని పింఛన్లు 4000 రూపాయలకు పెంచుతామని వికలాంగు పింఛన్లు 6000 రూపాయలకు పెంచుతామని 500 రూపాయలకే గ్యాస్ ఇస్తామని నిరుద్యోగ భృతి కల్పిస్తామని ఇలా ఎన్నో కబుర్లు చెప్పారని ఇప్పటివరకు వాటిని నెరవేర్చిన పరిస్థితి లేదని అన్నారు చేతగానప్పుడు హామీలు ఇవ్వడం దేనికని విమర్శించారు మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని రానున్న స్థానిక ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలు రెండు తోడు దొంగలన్న నిజాన్ని ప్రజలు గుర్తించాలని అన్నారు బెహన్ జి మాయావతి గారి స్ఫూర్తి తోటి మహిళలు రాజకీయాలలో శక్తివంతంగా పాల్గొనాలని అన్నింటిలో రాజ్యాధికారంలో సమాన వాటా కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు మహిళా సాధికారత కోసం పనిచేస్తున్న బహుజన్ సమాజ్ పార్టీకి మహిళలు మేధావులు విద్యావంతులు ప్రముఖులు తమ ఓట్ల ద్వారా అధికారాన్ని ఇవ్వాలని కోరారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షులు గోగికార్ రామ్ లక్ష్మణ్ మండల ప్రధాన కార్యదర్శి కొప్పుల రాంబాబు, పార్టీ మండల మండల కోశాధికారి చెన్నం మోహన్ పార్టీ మండల ఈసీ మెంబర్ గుర్రాల విజయ్ కుమార్ పార్టీ సెక్టార్ నాయకులు పర్శిక త్రిమూర్తులు అమరవాది యశోద రెడ్డి ,వాసం మోహన్, పాయం రవి, అలవాల రవి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులను విస్మరించారు

- ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో నిరుపేదలకు శఠగోపం



జయభేరి, చర్ల, జులై 20 :

కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రతిష్టాత్మకమైన ఇందిరమ్మ ఇండ్ల పథకం పేదలకు తీవ్ర అన్యాయం చేసిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.అసలైన పేదలను విస్మరించి కాంగ్రెస్ కార్యకర్తలకు ఇందిరమ్మ ఇండ్లను కట్టబెట్టారనే ప్రచారం సాగుతోంది.ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ ప్రకటించగానే అదే పార్టీకి చెందిన చోటామోటా నాయకులు ఎమ్మెల్యే అనుచరులమంటూ పేదోడికి ఇందిరమ్మ ఇండ్లు అందకుండా చేశారు.ఒకే ఇంట్లో ముగ్గురు నలుగురు వ్యక్తులకు ఇందిరమ్మ ఇండ్లను కట్టబెట్టారు. ఈ దృశ్యాలు చూసిన నిరుపేదలు ప్రభుత్వ తీరుపై దుమ్మెత్తి పోస్తున్నారు.ఎవరి లబ్ధి కోసం ఇందిరమ్మండ్ల నిర్మాణ కార్యక్రమం చేపట్టారని నిలదీస్తున్నారు? కార్యకర్తలకు ఇచ్చేటప్పుడు పేదలకు ఇస్తున్నామని చెప్పుకోవడం ఎందుకని మండిపడుతున్నారు.ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక తీవ్ర చర్చకు దారి తీసిందనే అని చెప్పాలి... కాంగ్రెస్ నాయకులు తమ తమ బంధువులకు సొంత వారికి మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు కట్టబెట్టడంతో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి... అయితే ఈ విషయమై సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాత్రం తమకేమి తెలియదంటున్నారు ఎమ్మెల్యే చుట్టూ చేరిన కొందరు చోట మోట నాయకులు చేసిన తప్పిందమే తప్ప మరోకటి లేదంటున్నారు.. ప్రభుత్వం పేదోడి కోసం తెచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకం మండలంలో అభాసు పాలవడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో హస్తం పార్టీకి భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నాయి.. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో నిరుపేదలకు తీవ్ర అన్యాయం జరిగిందని కొందరు అధికారులకు తెలిసినప్పటికీ వారసైతం నోరెత్తడానికి భయపడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం కొందరు అధికారులను ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో భాగస్వామ్యం చేసింది అయినప్పటికీ వారి ప్రమేయం లేకుండానే కొందరు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను ఎంపిక చేశారు.ఈ ఎంపిక నిరుపేదలకు తీవ్ర అన్యాయం చేసింది.నిరుపేదలు ఎప్పటిలాగే పాడుబడిన గుడిసెలను నమ్ముకుని జీవిస్తున్నారు.అసలు ఎవరి లబ్ధి కోసం ఇందిరమ్మండ్ల పథకం అనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.అర్హులకు అన్నయ్య జరగడంతో అటు అసలైన నాయకులు,కార్యకర్తలు మౌనం వీడడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.ఇందిరామ లబ్ధిదారులు ఎంపిక ఎమ్మెల్యే కూడా తెలియదా?అనేది ప్రశ్నగా మారింది ఒకవేళ తెలిస్తే అనార్హులకు ఇండ్లు ఎలా కేటాయిస్తారనే ప్రశ్నలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఇందిరమ్మ ఇండ్ల ఎంపికల్లో జరిగిన అవకతవకలపై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ చేసి అనర్హులను ఎంపిక చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.


# మొక్కజొన్న రైతుల ఆవేదన


## మాకు నష్టపరిహారం అందించాలి



జయభేరి, వెంకటాపురం, జులై 20 :

బహుళ జాతి మొక్కజొన్న సాగుచేసిన రైతులు దిగుబడి రాక పంట నష్టపరిహారం అందక తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు, కన్నాయిగూడెం, మండలాల మొక్కజొన్న పంట నష్టపోగా, బహుళ జాతి మొక్కజొన్న కంపెనీల నుండి ఆందోళనలు ఫలితంగా నష్టపరిహారాన్ని, కంపెనీల నుండి రైతులకు చెక్కుల ద్వారా పంపిణీ చేశారు . ఈనెల ఏడో తేదీన ములుగు జిల్లా వాజేడు లో బహుళ జాతి మొక్కజొన్న రైతులు పంట నష్టపరిహారం చెక్కులను మంత్రి సీతక్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ములుగు కలెక్టర్ దివాకర్ టిఎస్ ఇతర అధికారుల ద్వారా చెక్కులను రైతులకు పంపిణీ చేశారు. సింజెంట కంపెనీ ఆర్గనైజర్ వెంకటాపురం కేంద్రంగా భూపాలపల్లి జిల్లా మహా ముత్తారం మండలం కనుకునూరు, రెడ్డిపల్లి, సింగంపల్లి, తదితర గ్రామాలు చెందిన సుమారు 70 మంది రైతులు 160 ఎకరాల్లో కంపెనీ మొక్కజొన్న విత్తనాలు అందించగా సాగు చేశారు. నకిలీ విత్తనాల కారణంగా ఎకరానికి టన్ను మాత్రమే దిగుబడి రావటంతో, రైతాంగం ఆందోళన వ్యక్తం చేసింది. తాము తీవ్రంగా నష్టపోయామని, నష్టపరిహారం ఇప్పించాలని, వెంకటాపురం ఆర్గనైజర్కు పలుమార్లు చెప్పగా రేపు మాపు అంటూ నెలల తరబడి తిప్పుకుంటున్నారని, ఇంతవరకు తమకు నష్టపరిహారం అందలేదని, సుమారు 30 మంది రైతులు, ఆదివారం వెంకటాపురం మండల కేంద్రానికి వచ్చి, ఆర్గనైజర్ ను కలిసేందుకు వెళ్లగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారని, రైతులు తెలిపారు. ఈ మేరకు భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్లో సింజెంటా కంపెనీ మొక్కజొన్న సాగు చేసి నష్టపరిహాం ఇప్పించాలని, గతంలోనే వినతి పత్రం అందజే శామన్నారు. అయినా కానీ ఇంతవరకు తమకు ఎటువంటి కష్టపరిహారం అందలేదని రైతులు తెలిపారు. తమకు న్యాయం జరగలేదని రైతుల పక్షాన కనుకునూర్ మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ వెంకటేష్ ఆధ్వర్యంలో, వెంకటాపురం ఆర్గనైజర్ తో పంట నష్టపరిహారం విషయం మాట్లాడేందుకు రైతులు తరలివచ్చారు. ఆర్గనైజర్ నుండి స్పందన లేకపోవడంతో, సింజంట కంపెనీ మొక్కజొన్న సాగు చేసి తీవ్రంగా నష్టపోయిన తమకు కంపెనీ నష్టపరిహారి ఇప్పించాలని, న్యాయం చేయాలని కోరుతూ వెంకటాపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.







## ఆగస్టు 3న జరుగు వైశ్య రాజకీయ రణభేరి సభను విజయవంతం చేయండి

జయభేరి, దేవరకొండ :


ఆర్యవైశ్యులు కేవలం సమాజ సేవలోనే కాకుండా రాజకీయాలను కూడా శాసించే విధంగా రాణించాలని వైశ్య రాజకీయ రణభేరి వ్యవస్థాపకులు, మలిదశ ఉద్యమకారులు డా.కాచం సత్యనారాయణ తెలిపారు. దేవరకొండ లో శ్రీ వాసవి కళ్యాణ మండపంలో ఆగస్టు 3న జరుగు వైశ్య రాజకీయ రణభేరి సభ పోస్టర్ను మాజీ నల్గొండ జిల్లా అధ్యక్షులు పానుగంటి మల్లయ్య మరియు మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ ఆర్యవైశ్య నాయకులతో కలిసి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకులు కేవలం ఆర్యవైశ్యుల ఓటు బ్యాంకు ను మాత్రమే వాడుకొని పబ్బం గడిపారని తెలిపారు. ఆర్యవైశ్య జనాభా ప్రకారం ఆర్యవైశ్యులకు అన్ని రంగాలలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రేపు జరగబోవు ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు అన్ని రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పోరాటాలకు ఖిల్లా అని, ఆగస్టు 3న హైదరాబాదులో జరిగే రాజకీయ రణభేరి సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి పాలకులకు మన సత్తా ఏమిటో చూపాలన్నారు. పార్టీలకతీతంగా జరుగు ఈ రణభేరి సభకు పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు తరలిరావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చీదెళ్ల వెంకటేశ్వర్లు శ్రీ వాసవి కళ్యాణ మండపం అధ్యక్షులు వాసా వెంకటేశ్వర్లు, శివాలయం కార్యదర్శి శిల వెంకన్న ,వాసవి క్లబ్ అధ్యక్షులు సముద్రాల సహదేవ్, గార్లపాటి దామోదర్, వాసవి క్లబ్ కోశాధికారి ఇడుకుల పుల్లయ్య, అతూకూరు ఆంజనేయులు, నీలా శేఖర్, బుక్క ఈశ్వరయ్య, బెలిదే మాధవి రవీందర్, సంతోష్‌వాసవి మహిళా సభ్యులు చిదేళ్ళ శ్రీదేవి, మాధవి, సంతోషి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించాలి



జయభేరి, కొండమల్లేపల్లి :

కేసియా, జోగ్య మరియు హంక్య తండా గ్రామంలో గత నెల రోజుల నుండి తీవ్రమైన తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. కృష్ణా వాటర్ సరఫరా అరకొరగా ఉండటంతో పాటు, పైపులైన్ లీకేజీల వల్ల నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 1500 మందికి పైగా జనాభాకు కృష్ణా వాటర్ సరఫరానే ప్రధాన ఆధారం అయితే, నెల రోజులుగా నీరు సరిగా రాకపోవడంతో పాటు, పలు చోట్ల పైపులు లీకై విలువైన నీరు వృథాగా రోడ్లపై పారుతోంది. గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై స్పందించిన గ్రామ యువకుడు ఆంగోత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ, కేసియా, జోగ్య మరియు హంక్య తండాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కృష్ణా వాటర్ అరకొరగా వస్తోంది, పైగా పైపుల లీకేజీల వల్ల నీరు పెద్ద ఎత్తున వృథా అవుతోంది . అధికారులు తక్షణమే స్పందించి, పైపులైన్ లీకేజీలను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించి , పూర్తిస్థాయిలో నీటి సరఫరాను పునరుద్ధరించి ప్రజల దాహార్తిని తీర్చాలి అని డిమాండ్ చేశారు.



## నిర్మాత కోసం తన రూల్స్ అన్నీ పక్కన పెడుతున్న పవన్..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాల కోసం అభిమానులు కళ్లల్లో ఒత్తులు వేసుకొని మరీ ఎదురు చూస్తుంటారనే విషయం మనందరికి తెలిసిందే. ఆయన రాజకీయాల్లోకి రావడంతో సినిమాలపై కాస్త ఆసక్తి తగ్గించారు. అయితే గతంలో కమిటైన సినిమాలని పూర్తి చేసే పనిలో పడ్డారు పవర్ స్టార్. పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. పవన్ కెరీర్‌లో ఇది మొదటి పాన్ ఇండియా మూవీ కావడంతో, ఈ సినిమాపై అభిమానుల్లోనే కాదు, సాధారణ ప్రేక్షకుల్లో కూడా ఆసక్తి నెలకొంది. సినిమా ఎలా ఉండబోతుందన్నది ఇప్పుడు అందరిలో క్యూరియాసిటీగా మారింది. ఈ సినిమా అనేకసార్లు వాయిదా పడుతూ వచ్చింది. మొదట కరోనా ప్రభావం, ఆ తర్వాత పవన్ రాజకీయంగా బిజీగా ఉండటంతో షూటింగ్ తరచూ నిలిచిపోయేది. రిలీజ్ డేట్లు ప్రకటించినా, వర్క్ పూర్తి కాక మళ్లీ వాయిదా వేయాల్సి వచ్చింది. ఇటీవల కూడా రెండు మూడు సార్లు రిలీజ్ డేట్ మారింది. చివరకు జూలై 24న థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాకు సంబంధించి బిజినెస్ సర్కిళ్లలో కూడా మిక్స్‌డ్ టాక్ వినిపిస్తోంది. బయ్యర్లు పెద్దగా ఆసక్తి చూపించలేదన్న వార్తల నేపథ్యంలో, నిర్మాత ఏఎం రత్నం స్వయంగా రిలీజ్ చేయాలనుకుంటున్నట్టు సమాచారం. చిత్రాన్ని పూర్తిచేయడానికి పవన్ తన పారితోషికంలో భాగం వెనక్కి ఇచ్చినట్టు కూడా టాక్ ఉంది.

## నేను దళితుడినని తెలిసిన తర్వాతే తెలుగులో సినిమా ఆఫర్లు తగ్గాయి



దిగ్గజ నటుడు, మాజీ మంత్రి బాబు మోహన్ సినీ పరిశ్రమలో తన అనుభవాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను దళితుడినని తెలిసిన తర్వాతే తనకు సినిమా అవకాశాలు గణనీయంగా తగ్గిపోయాయని ఆయన వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

దిగ్గజ నటుడు, మాజీ మంత్రి బాబు మోహన్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. నటుడిగా, హాస్య నటుడిగా, విలన్‌గా, సహాయ నటుడిగా ఇలా వందల సినిమాల్లో నటించి ప్రేక్షకుల మన్ననలు పొందాడు. ఈ తర్వాత రాజకీయల్లో ప్రవేశించి శాసనసభ సభ్యుడిగా, మంత్రిగా తనదైన ముద్ర వేశారు. అయితే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గోన్న బాబు మోహన్ సినీ పరిశ్రమలో కుల వివక్ష ఉందని సంచలన వ్యాఖ్యలు చేశాడు.

నేను దళితుడినని చాలా మందికి తెలియదు. ఈ విషయం నేను కూడా ఎప్పుడు బయటపెట్టలేదు. కానీ ఎప్పుడైతే నేను రాజకీయల్లోకి ప్రవేశించిన తర్వాత నా కులం బయటపడిందో అప్పటినుంచి బాబు మోహన్ దళితుడా అంటూ కామెంట్లు వినిపించేవి. ఇదే కారణంతో నాకు వచ్చే సినిమా ఆఫర్లు తగ్గిపోయాయి. నన్ను దూరం పెట్టడం మొదలుపెట్టారు. సినీ పరిశ్రమలో ప్రతిభకు బదులు కులానికే ప్రాధాన్యత ఉంటుందని బాబు మోహన్ ఆవేదన వ్యక్తం చేశాడు.



## ఎర్రటి చీరలో చెర్రీలా..

బ్యూటీ నిధి అగర్వాల్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. మార్వాడి కుటుంబంలో జన్మించిన ఈ చిన్నది మోడలింగ్ చేసి, తద్వారా సినిమాల్లోకి అడుగు పెట్టి తన నటనతో అందరినీ ఆకట్టుకుంటుంది. నిధి అగర్వాల్ 2017 లో మున్నా మైఖేల్ అనే హిందీ సినిమాతో నటిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ ఫలితం ఎలా ఉన్నా ఈ అమ్మడుకు మాత్రం మంచి ఫేమ్ వచ్చింది. దీంతో తర్వాత అక్కినేని నాగచైతన్య నటించిన సవ్యసాచి అనే సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమాలో నటించినప్పటికీ ఈ అమ్మడుకు అంతగా గుర్తింపు రాలేదు అనే చెప్పాలి. తెలుగు అభిమానులను అంతగా ఆకట్టుకోలేకపోయింది. తర్వాత పూరి జగన్నాథ్, రామ్ కాంబోలో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సినిమాలో ఛాన్స్ లభించింది. ఈ సినిమాతో ఈ బ్యూటీకి మంచి క్రేజ్ వచ్చింది. మూవీ కూడా హిట్ అవ్వడంతో తొలి హిట్ తన ఖాతాలో వేసుకొని, మంచి ఫేమ్ సొంతం చేసుకుంది. కానీ ఊహించిన విధంగా బెస్ట్ అవకాశాలు మాత్రం ఈ అమ్మడు సొంతం చేసుకోలేకపోయింది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా హరిహర వీరమల్లులో పవన్ కళ్యాణ్ కు జోడిగా నటిస్తోంది. ఈ మూవీ జూలై23న విడుదల కానున్న విషయం తెలిసిందే. దీంతో మూవీ టీం ప్రమోషన్స్ జోరు పెంచింది. ఈ క్రమంలోనే అందాల ముద్దుగుమ్మ నిధి అగర్వాల్ తన అందాలతో నెట్టింట్లో రచ్చ చేస్తుంది. ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉండే ఈ ముద్దుగుమ్మ తాజాగా తన ఇన్ స్టాలో చీరలో ఉన్న ఫొటోలు షేర్ చేసింది. అందులో ఈ బ్యూటీ ఎరుపు చీరలో అందంగా కనిపిస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.



## యమా హాట్ గురూ..

అర్జున్ రెడ్డి సినిమాలో హీరో ఫ్రెండ్ గా నటించింది ఆమె.. ఆ ముద్దుగుమ్మ పేరు అదితి మ్యాకల్. ఈ ముద్దుగుమ్మ చాలా సినిమాల్లో చిన్న చిన్న పాత్రల్లో కనిపించి మెప్పించింది. అలాగే హీరోయిన్ గాను సినిమాలు చేసి ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. చిన్న వయసులోనే కూచిపూడి నేర్చుకొని, పలు ప్రదర్శనలు ఇచ్చి శభాష్ అనిపించుకుంది ఈ ముద్దుగుమ్మ. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేసిన ఈ భామ .. పలు ఫ్యాషన్ షోలోనూ పాల్గొంది. సినిమాల పై మోజుతో సినిమాల్లోకి అడుగుపెట్టింది ఈ చిన్నది. యూట్యూబ్ వెబ్‌సిరీస్‌లు, షార్ట్ ఫిలిమ్స్‌లో నటించింది. తను నటించిన 'పాప పి సుశీల', 'ముద్దపప్పు ఆవకాయ్', 'పాష్ పోరీస్' లతో సినిమాల్లో అవకాశాలు అందుకుంది. అర్జున్ రెడ్డి సినిమా ఈ చిన్నదానికి మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. 'అమీ తుమీ','రాధ', 'మిఠాయ్', 'దెబ్బకు ఠా.. దొంగల ముఠా', 'నేనులేని నా ప్రేమకథ' సినిమాల్లో నటించి మెప్పించింది. ఇక ఈ అమ్మడు బయట చాలా హాట్ గురూ.. సోషల్ మీడియాలో ఈ చిన్నది హాట్ హాట్ ఫొటోలతో కవ్విస్తుంది. ఈ చిన్నదాని ఫోటోల పై మీరూ ఓ లుక్కేయండి.

## 'ఆషికి 2' సీక్రెట్: రణబీరే ఆదిత్య రాయ్‌ని పంపాడు : మోహిత్ సూరి





బాలీవుడ్ స్టార్ దర్శకుడు మోహిత్ సూరి దర్శకత్వంలో వచ్చిన ఆషికి 2 ఎంత పెద్ద హిట్టయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆదిత్యరాయ్ కపూర్. శ్రద్ధ కపూర్ జంటగా వచ్చిన ఈ చిత్రం లవ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చి సూపర్ హిట్ అందుకోవడమే కాకుండా ఆదిత్య రాయ్ కపూర్, శ్రద్ధా కపూర్‌లను స్టార్‌లుగా నిలబెట్టింది. ఈ మూవీలోని పాటలు ఇప్పటికి ప్రతిచోట వినిపిస్తునే ఉంటాయి. అయితే ఈ సినిమాలో కథానాయకుడిగా ఆదిత్యరాయ్ కపూర్‌ని ఎంపిక చేయడంపై ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు దర్శకుడు మోహిత్ సూరి. ఈ సినిమాకు ఆదిత్య రాయ్‌ని ఎంపిక చేసే ప్రక్రియలో రణబీర్ కపూర్ కీలక పాత్ర పోషించారని మోహిత్ సూరి స్వయంగా వెల్లడించారు. తన తాజా చిత్రం సైయారా ప్రమోషన్‌స్‌లో పాల్గోన్న మోహిత్ సూరి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'ఆషికి 2' గురించి ప్రస్తావించాడు. 'ఆషికి 2' కోసం నూతన నటీనటులను ఎంపిక చేయడానికి దేశవ్యాప్తంగా టాలెంట్ హంట్ నిర్వహించామని.. అయితే తాము అనుకున్న విధంగా ఫలితం రాలేదని మోహిత్ పేర్కొన్నారు. ఆ సమయంలోనే, రణబీర్ కపూర్ ఆదిత్య రాయ్ కపూర్‌కు ఫోన్ చేసి, "నువ్వు వెళ్లి మోహిత్ సూరిని కలువు, అతను మంచి దర్శకుడు" అని చెప్పినట్లు మోహిత్ సూరి వెల్లడించారు.

రణబీర్ మాటతోనే ఆదిత్య రాయ్ కపూర్ తనను కలవడానికి వచ్చాడని, అప్పుడు షార్ట్, టీషర్‌ట్ తో వచ్చిన అతని డ్రెస్సింగ్ స్టైల్ కాస్త విచిత్రంగా అనిపించిందని. కానీ.. ఆదిత్యలో రాహుల్ జైకర్ (ఆషికి 2లోని హీరో పాత్ర) పాత్రకు సరిపోయే లక్షణాలు కనిపించాయని అందుకే అతడిని తీసుకున్నామని మోహిత్ చెప్పుకోచ్చాడు. అలా రణబీర్ కపూర్ ఇచ్చిన చిన్న సలహానే ఆదిత్య రాయ్ కపూర్ కెరీర్‌లో పెద్ద మలుపుగా మారి 'ఆషికి 2' లాంటి బ్లాక్‌బస్టర్ లభించింది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com